నమస్తే తెలంగాణ

వరంగల్ హనుమకొండ

3 | శుక్రవారం 10 మే 2024 | WARANGAL HANUMAKONDA




వెంకట్రామ జంక్షన్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

# కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలి

- పదవుల కోసం పార్టీ మారిన కడియంకు బుద్ధి చెప్పాలి
- ఉద్యమనేత సుధీర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలి : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- పోచమ్మమైదాన్, కాశీబుగ్గ, వెంకట్రామ జంక్షన్‌లో బీఆర్‌ఎస్ కార్నర్ మీటింగ్

పోచమ్మమైదాన్/కాశీబుగ్గ, మే 9: ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్‌ను, తెలంగాణ అభివృద్ధిపై చిన్నచూపు చూసిన బీజేపీని చిత్తుగా ఓడించాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు బీఆర్‌ఎస్‌లో అన్ని పదవులు అనుభవించి పార్టీకి నమ్మకద్రోహం చేసిన మోసగాళ్లని, వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. గురువారం రాత్రి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ సెంటర్, కాశీబుగ్గ, వెంకట్రామ జంక్షన్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్‌ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచంపల్లి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో అన్ని పదవులు అనుభవించి మోసం చేసిన కడియం శ్రీహరికి బుద్ధి చెప్పాలంటే ఆయన కుమార్తె కావ్యను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాజకీయ వారసత్వం కోసం కన్నతల్లి వంటి బీఆర్‌ఎస్‌కు ద్రోహం చేసిన ఆయనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్ని ప్రలోభాలు పెట్టినా కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

**పదేళ్లలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్లలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తే.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఐదు నెలల్లోనే భ్రష్టు పట్టించిందని పోచంపల్లి విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 60 మోసాలతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు పేదలకు ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, తులం బంగారం, రైతుబంధు, రైతు బీమా, చేనేత బీమా, గర్భిణులకు కిట్, మహిళలకు రూ.2,500 అడ్రస్ లేకుండా పోయాయని విమర్శించారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలు, ఎన్నికల ముందు కాంగ్రెస్ చేసిన వాగ్దానాలు కార్యరూపం దాల్చాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి పేదింటి బిడ్డ సుధీర్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎండీ మసూద్, తుమికి రమేశ్‌బాబు, మెట్టు శ్రీనివాస్, బస్వరాజు శ్రీమాన్, డాక్టర్ హరిరమాదేవి, ఎండీ మస్తాన్, జన్ను శ్యామ్, బండారి సదానందం, గుమ్మడి శ్యామ్, మెలుగూరి నెల్సన్, దుర్గారావు, జన్ను అనిల్, జన్ను కరుణాకర్, జన్ను రవి, కుందారపు రాజేందర్, డాక్టర్ పులి సురేశ్, ఎండీ.మసూద్, ఎలేటి సతీశ్, కేతిరి రాజశేఖర్, పోలెపాక సీతయ్య, మడిపల్లి సామ్యేల్, యాసిన్, పోలెపాక ప్రశాంత్, కొడారి రవి, మడిపెల్లి నాగరాజు, కొప్పుల వీరేశం పాల్గొన్నారు.



రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు



డోర్నకల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత, పక్కన ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

## నేను పక్కా లోకల్ : మాలోత్ కవిత

'నేను డోర్నకల్ ఆడబిడ్డను.. పక్కా లోకల్' అని అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ ప్రజలకు సేవలు అందించానని చెప్పారు. కేసీఆర్ దెబ్బకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు వేస్తున్నదని, త్వరలో ఆ పార్టీని రైతులే బొందపెడ్తరని పేర్కొన్నారు. గ్యారెంటీల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదన్నారు. కాంగ్రెసోళ్లు దేవుళ్ల మీద ఒట్టు వేస్తే, బీజేపోళ్లు దేవుడి పేరు చెప్పుకొని ఓట్లు అడుగుతున్నారన్నారు. కేసీఆర్ పాలనలో కాళేశ్వర జలాలలో చెరువులు, కుంటలను నింపడం వల్ల చివరి ఆయకట్టు వరకు ఒక్క పొలం కూడా ఎండిపోలేదన్నారు. కేసీఆర్ యువతకు ఉద్యోగాలు కల్పించారని, అందుకే యువత అందరూ బీఆర్‌ఎస్ వెంట ఉన్నారని పేర్కొన్నారు. మీ ఆశీస్సులు ఉండాలని కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

# ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

- ఓటడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది
- గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్
- అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి
- ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత
- రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన శ్రేణులు, ప్రజలు

డోర్నకల్, మే 9 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక మాలోత్ కవితను గెలిపించాలని, స్వార్థం కోసం పార్టీలు మారే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గురువారం డోర్నకల్‌లో మహబూబాబాద్ అభ్యర్థి మాలోత్ కవితతో కలిసి ఆమె రోడ్‌షో నిర్వహించారు. పెట్రోల్‌బంక్ నుంచి రైల్వేస్టేషన్ వరకు సాగిన ప్రచార కార్యక్రమంలో వెయ్యి మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని జై కేసీఆర్, జై కవితమ్మ అంటూ నినాదాలతో హోరెత్తించారు. బీఆర్‌ఎస్ జెండాలతో పట్టణ రోడ్లన్నీ గులాబీమయం అయ్యాయి.

**సేవ చేసే వారికే ఓటేయాలి..**

మాలోత్ కవితను లోక్‌సభ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దీవించి పంపారని, మీరంతా ఆశీర్వదించి పట్టంకట్టాలని సత్యవతి కోరారు. ఎన్నికలు వచ్చినప్పుడు అన్ని పార్టీల నాయకులు వస్తారని, కానీ ఎవరు సేవ చేస్తారో ఆలోచించి వారికే ఓటు వేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ హయాంలో డోర్నకల్‌లో అన్ని విధాలా అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ఆసరా పింఛన్ రూ.2016, పేదింటి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మి, ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు అందించామని గుర్తుచేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. కరెంట్ కష్టాలు మొదలయ్యాయని, ఎన్నో ఏళ్ల తర్వాత మున్నేరు వాగు ఎండిపోయిందని, ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా దేవుళ్ల మీద రేవంత్‌రెడ్డి ఒట్టు వేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతులకు బోనస్ ఇవ్వలేదని మండిపడ్డారు. మళ్లీ ఇప్పుడు ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి దొంగ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. డోర్నకల్ ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందన్నారు. మహబూబాబాద్‌కు రేవంత్‌రెడ్డి వస్తే ప్రజలే రాలేదని, గంట సేపు బస్సులో ఉన్నారని.. కానీ కేసీఆర్ బస్సుయాత్ర నిర్వహిస్తే రోడ్లు దద్దరిల్లిపోయాయని చెప్పారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరంసోత్ బాలూ నాయక్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తె రసాల విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, వైస్ ఎంపీపీ తుమ్మ వెంకటరెడ్డి, వార్డు కౌన్సిలర్లు పోటు జనార్దన్, బోరగల్ల శరత్‌బాబు, కొండేటి హేమచంద్ర శేఖర్, కాలా మౌనికా జైన్, కొత్త రాధిక, కందుల అరుణ, తేజావత్ సంధ్యారాణి, బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కళ్లెపు సతీశ్ కుమార్‌గౌడ్, మండల కో ఆప్షన్ షేక్ లాలూ మియా, మాజీ సర్పంచ్‌లు గుగులోత్ శ్రీనివాస్, బోయినపల్లి వెంకన్న, ఎంపీటీసీ బానోత్ శంకర్ కోటి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రాంభద్రం, అజిత్‌మియా, బీఆర్‌ఎస్ నాయకులు మాన్య పొట్ని, కాలా యశోధర్ జైన్, కొత్త వీరన్న, తేజావత్ రమేశ్, కందుల మధు, చంటి, గౌస్, కొత్త కుమార్, జాల రమేశ్, రహీం, విక్కీ, గణేశ్ ఠాగూర్ పాల్గొన్నారు.



డోర్నకల్‌లో రోడ్ షోకు తరలివచ్చిన గులాబీ శ్రేణులు, ప్రజలు

# బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలి

- సమష్టిగా కృషి చేసి వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల, మే 9: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గురువారం జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని రేగుల, రంగాపురం, ఏడునూతుల, నర్సింగాపురం ఎంపీటీసీ క్లస్టర్‌లలో పార్టీ మండల అధ్యక్షుడు సిందే రామోజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలన తలాతోక లేని విధంగా ఉన్నదని, మోసపూరిత హామీలు 420 ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను ఆగం చేస్తున్నారని పేర్కొన్నారు. నాలుగు నెలల్లో కరెంటు లేక రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే మనం కేసీఆర్‌కు బలం చేకూర్చే విధంగా బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏడునూతుల గ్రామానికి చెందిన నాయకులతో కలిసి దయాకర్‌రావు మిర్చి కాల్చి ఓట్లు అభ్యర్థించారు. అదేవిధంగా ఏడునూతుల గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్స్ చెన్నబోయిన యాకయ్య, మద్దెబోయిన కుమార్ వారం రోజుల వ్యవధిలోనే మాజీ మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీఎస్ఈజీసీ సభ్యుడు అందె యాకయ్య, ఏఎంసీ చైర్మన్ పేరం రాము, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, జడ్పీటీసీ కేలోత్ సత్తెమ్మ, పార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ ఆసిఫ్, వైస్ ఎంపీపీ వీరసోములు, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దేశగాని సతీశ్, సొసైటీ వైస్‌చైర్మన్ మేటి సోమరాములు, పార్టీ నాయకులు బాకీ ప్రేమ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా మంగ్యానాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ బాబర్, కప్పల శ్రీనివాస్, ఎలిట్టె సోమన్న, పనస రాజు, కుంచం హరీశ్, మహ్మద్ షన్నా, ముత్యం మధు పాల్గొన్నారు.



హోటల్‌లో మిర్చి కాలుస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

# కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత

- రేవంత్ ఝూటా సీఎం
- ముస్లింల సంక్షేమానికి బీఆర్‌ఎస్ విశేష కృషి
- మాజీ హోం మంత్రి మహమూద్ అలీ
- కాంగ్రెస్, బీజేపీలను భూస్థాపితం చేయాలి : దాస్యం
- అందరూ బీఆర్‌ఎస్ వైపే.. నా గెలుపు ఖాయం
- వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్

హనుమకొండ, మే 9 : మాయమాటలు, అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఓ ఝూటా సీఎం అని మాజీ హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ నాయకుడు నయీముద్దీన్ అధ్యక్షతన ముస్లింలు, సిక్కులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహమూద్ అలీ హాజరు కాగా వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమూద్‌అలీ మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్సే అని అన్నారు. నిరుపేద ముస్లింల వివాహాలకు షాదీముబారక్ పథకం ద్వారా ఆర్థిక సాయం, రంజాన్ సందర్భంగా నూతన వస్త్రాలు, ఇమామ్‌లకు వేతనాలు అందజేసిన మహనీయుడు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అని తెలిపారు. ముస్లింల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ముస్లింలను పట్టించుకోలేదన్నారు. అమలు, ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై అనతి కాలంలోనే అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదన్నారు. బడే భాయ్ మోడీ, చోటే భాయ్ రేవంత్‌రెడ్డి ఇద్దరూ ఒక్కటేనని అన్నారు. బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్ నిఖార్సైన ఉద్యమకారుడని, నీతిమంతుడైన ఆయనను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించి కేసీఆర్ రుణం తీర్చుకోవాలని ముస్లింలను మహమూద్ అలీ కోరారు.

**మైనార్టీల గురించి మాట్లాడింది ఒక్క కేసీఆర్**

మతతత్వ బీజేపీ, మోసం చేసిన కాంగ్రెస్ పార్టీలను భూ స్థాపితం చేయాలని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మైనార్టీలు భాగస్వాములయ్యారన్నారు. 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు మసీదులు, ఇమామ్‌లు, మైనార్టీల గురించి మాట్లాడలేదని, తెలంగాణ ఏర్పాటు అనంతరం వారి గురించి మాట్లాడింది ఒక్క కేసీఆరేనని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్‌ఎస్‌పై లేనిపోని అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయని, ఆ పార్టీలను ప్రజలు నమ్మవద్దని కోరారు. విద్యకు దూరమైన మైనార్టీ విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో మైనార్టీలకు ఉసూల్‌ఖానా, కుట్టు శిక్షణ కేంద్రం లాంటివి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బడాభాయ్.. చోటాభాయ్‌లు తెలంగాణలో కుట్రలు పన్నుతూ చిచ్చురేపుతున్నారన్నారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలిస్తే ఆయన నిధుల నుంచి మైనార్టీ భవన్ నిర్మించే బాధ్యత తనదేనని దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. పార్టీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీకి రోజు రోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్, బీజేపీలకు భయం పుట్టుందని అన్నారు. దీంతోనే మోదీ, రేవంత్‌రెడ్డి వరంగల్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని అన్నారు. ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. అలాగే, పార్టీలు మారే వ్యక్తులకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో ముస్లింలకు చోటు ఉండదన్నారు. తనను వరంగల్ ఎంపీగా గెలిపిస్తే దేశానికి ఒక దిక్సూచిగా పని చేస్తానని అన్నారు. సమావేశంలో మాజీ చైర్మన్ మౌలానా యూసుఫ్ జాయిద్, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ మేయర్ మసూద్, మాజీ మేయర్ సిరాజుద్దీన్, షఫీ, ఎలిషా, తస్లీమా, పర్వీన్, సోని, మైనార్టీ, సిక్కు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహమూద్ అలీ, వేదికపై దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్



మంటల్లో కాలిపోయిన మక్కజొన్న చొప్ప

# రైతు సజీవ దహనం

- మక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టిన అన్నదాత
- ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకొని మృతి

చెన్నారావుపేట, మే 9: ఓ రైతు మక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టగా, ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని సజీవ దహనమయ్యాడు. ఈ హృదయ విదారక ఘటన చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లంనేని పాపారావు(65) గురువారం తన వ్యవసాయ భూమిలో మక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టాడు. గాలి వీచడంతో మంటలు పక్కనే ఉన్న ఓ రైతు ఆయిల్ పామ్ తోటకు వ్యాపించాయి. అప్రమత్తమైన పాపారావు మంటలను ఆర్పేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన ప్రమాదవశాత్తు అదే మంటల్లో చిక్కుకొని ఊపిరాడక సజీవ దహనమయ్యాడు. అతడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సంపేట ప్రభుత్వం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. కాగా, రైతు భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించి, ఆయన కుటుంబు సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పాపారావు(ఫైల్)

## కేసీఆర్ ఉన్నప్పుడు రంది లేకుండె

– గౌడ మహేశ్, రైతు, భూపాలపల్లి



జయశంకర్ భూపాలపల్లి, మే9(నమస్తే తెలంగాణ): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులు నిమ్మలంగా ఉండె. నీళ్లకు, కరెంటుకు ఎలాంటి ఇబ్బంది లేకుండె. పంటకు ముందే పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పంట చివర్ల రైతుబంధు సాయం ఇచ్చిండ్రు. అది కూడా 5 ఎకరాల లోపే. అందరికీ అందలే. వానకాలం పంటలు వేసినంక సర్వే చేశాక రైతుబంధు ఇస్తరట. అంటే మల్ల పంట చేతికొచ్చే టైం దగ్గర పడుతది. పేద రైతులకు పెట్టుబడి సాయం ఎక్కడ ఆసరా అవుతది. పెట్టుబడికి అప్పులు తెచ్చు కోవాలె. అవి వడ్డీకే సరిపోవు. యాసంగి వడ్లు అమ్ముకునే టైంలో రైతుబంధు డబ్బులు వచ్చినయి. ఇక వానకాలం రైతుబంధు డబ్బులు ఎప్పుడొస్తయో తెల్వదు.

*పెట్టుబడి సాయంపై రైతుల్లో ఆందోళన రోజురోజుకూ పెరుగుతున్నది. రైతుబంధును రైతుభరోసాగా పేరు మార్చిన కాంగ్రెస్ సర్కారు సీజన్‌లో మొదట్లోనే సాయం అందించాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నదాతల్లో అయోమయం నెలకొంది. దీనికి తోడు ఐదెకరాలకే రైతుభరోసా వర్తిస్తుందని ఒక మంత్రి, అందరి సాగు వివరాలు పరిశీలించి ఇస్తామని మరో మంత్రి, పంటలు ఉన్న భూములను పరిశీలించి ఇస్తామని ప్రభుత్వ పెద్దలు.. ఇలా విభిన్నమైన ప్రకటనలు చేస్తుండడంతో అసలు పెట్టుబడి సాయం వస్తుందా? రాదా? అనే సందేహం వారిలో వ్యక్తమవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రందిలేకుండా అదునుకు రైతుబంధు పడేదని, ఈ కాంగ్రెస్ అచ్చినంక అంతా ఆగమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*

**- వరంగల్, మే 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

# రైతుకు లేదు భరోసా..

- పెట్టుబడి సాయం వస్తుందా? రాదా? అని సందేహం
- మంత్రుల భిన్న ప్రకటనలతో అయోమయం
- 'రేవంత్ వాయిదాల'తో ఆందోళనలో అన్నదాతలు

తాము సాగుచేసే పంటల వివరాలను ఎవరు నమోదు చేస్తారని, ఎలా పరిశీలిస్తారనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వానకాలం, యాసంగిలో వేర్వేరు పంటలు సాగు చేస్తామని.. ప్రభుత్వ సిబ్బంది ఎప్పుడు వచ్చి నమోదు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. అదునుకు పెట్టుబడి సాయంగా ఇవ్వాల్సిన రైతుబంధు అధికారుల నివేదిక తర్వాతే ఇచ్చే అవకాశం ఉంటుందని, ఇలా అయితే అవసరమైన సమయంలో సాయం ఎలా అందుతుందని అంటున్నారు.

**అదును వస్తున్నా..**

రైతు భరోసా అమలుపై రాష్ట్ర ప్రభుత్వం మొదటినుంచీ వాయిదాలతో దాటవేస్తున్నది. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా గతేడాది డిసెంబర్ 9న అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఆ తర్వాత గడువును నెలకోసారి మార్చుతూ వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ గడువును ఏకంగా ఆగస్టు 15కి పెంచారు. వానకాలం పంటల సీజన్ జూన్ 1నుంచి మొదలవుతుంది. రైతులకు అప్పుడే పెట్టుబడి సాయం అవసరమవుతుంది. విత్తనాలు, నాట్లు వేసే సమయంలో ఉండే ఖర్చులకు రైతుబంధు ఉపయోగపడుతూ వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఆగస్టు 15 అని చెబుతుండడంతో పెట్టుబడి ఖర్చుల కోసం రైతులు బ్యాంకులు, ప్రైవేట్ వ్యాపారుల దగ్గర అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తున్నది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతుబంధు రూపంలో అదునుకు పెట్టుబడి సాయం అందేదని, ఆరేళ్ల తర్వాత సాయంపై అయోమయం నెలకొన్నదని రైతులు వాపోతున్నారు.



మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఎండిన వరిని మేస్తున్న పశువులు

## సీజన్‌కు ముందే పైసలేయాలె

– బిళ్ల అంజమ్మ, రైతు, కామారెడ్డిగూడెం



దేవరుప్పుల: వానకాలం, యాసంగికి ముందే రైతు బంధు పైసలు వేయాలె. పెట్టుబడి డబ్బులు టైముకు రైతుల ఖాతాలల్ల పడితె ఇత్తనాలు, కూలీలు, ఎరువులకు అక్కరకొస్తయి. రియల్ ఎస్టేట్, రోడ్లకు పోయిన భూములు తీసేయండి. అంతేగాని రైతులను చిన్నపెద్ద అని చూడక ఎన్నెకరాలు ఉన్నా అందరికి పెట్టుబడి పైసలిస్తేనే బాటుంటది. పంటలను ప్రభుత్వం కొనడం, రైతు బంధు, కరెంట్, సాగునీరు పుష్కలంగా ఇయ్యడంతో రైతు కుటుంబాలు ఈ మధ్యనే ఇగురుపెడుతున్నయ్. ఇంతలోనే ఈ ప్రభుత్వం రైతు బంధు మీద తాకట్టుపెడుతాంది.